## క్లుప్తంగా

### సామర్లకోట సీఐగా అంకబాబు



సామర్లకోట: స్థానిక పోలీస్ స్టేషన్ సీఐగా ఆర్. అంకబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ సీఐగా పని చేసిన సురేష్ బదిలీ కావడంతో అతని స్థానంలో సామర్లకోట క్రైం సీఐగా పని చేస్తున్న అంకబాబును నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

### తాగునీటి సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం ప్రాంతానికి శుక్రవారం మున్సిపల్ కుళాయిల ద్వారా తాగునీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అప్పయ్యచెరువు వద్ద ప్రధాన డ్రైన్‌లో పూడికతీత పనుల సమయంలో జేసీబీ ప్రధాన పైపులైన్‌ను తొలగించడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీనిపై మున్సిపల్ కమిషనర్ జె.రామారావును వివరణ కోరగా పూడికతీత సమయంలో పైపులైన్ పాడైపోయిందని, మరమ్మతులు చేయించామన్నారు. శనివారం నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందన్నారు. అయితే శుక్రవారం సాయంత్రం వాటర్ ట్యాంకర్ పంపామని చెప్పారు.

### సాయం చేయబోతే సెల్ చోరీ

సామర్లకోట: మోటారు సైకిలు నుంచి పడిపోతున్న వారికి సాయం చేద్దామని ప్రయత్నిస్తున్న వ్యక్తి నుంచి సెల్ ఫోన్ చోరీ చేసిన ఘటన ఇది. బాధితుని కథనం ప్రకారం శుక్రవారం ఒడిషా రాష్ట్రం నుంచి సామర్లకోటకు నువ్వుల లోడ్ తీసుకువచ్చిన లారీ డ్రైవర్ మాగాపు మాణిక్యాల రావు స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుంచి మెహర్ కాంప్లెక్స్‌కు టీ తాగడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక పెన్షన్‌లైన్ దుర్గగుడి వద్ద మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు వాహనం నుంచి పడిపోతున్నట్లు నటించారు. వారిని రక్షించే ప్రయత్నంలో మాణిక్యాలరావు జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకుని వేగంగా ఉడాయించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. రూ.24 వేలకు ఇటీవల కొనుగోలు చేసిన సెల్‌ఫోన్ చోరీకి గురి కావడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్సై మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న వెంకటేశ్వరరావు

కొత్తపల్లి: పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. కొండెవరంలోని జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

### పాము కాటుకు కౌలు రైతు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

పిఠాపురం: పాము కాటుకు ఓ కౌలు రైతు మృతి చెందాడు. పిఠాపురం మండలం గోకివాడకు చెందిన కౌలు రైతు కొమ్ము నాగేశ్వరరావు (58) శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లి గడ్డి కోస్తుండగా పాము కాటుకు గురయ్యారు. పొలం నుంచి ఇంటికి వచ్చి స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



పిఠాపురంలో బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళి అర్పిస్తున్న నాయకులు

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పుపై స్థానిక మంగయ్యమ్మరావుపేట, చిట్టోడు తోట, అగ్రహారం ప్రాంతాలకు చెందిన రెల్లివీధి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. 30 ఏళ్ల పోరాటానికి తగిన ఫలితం దక్కిందన్నారు. దేశ మహోన్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ చేసి అణగారిన దళితులకు సముచిత న్యాయం అందించడం గొప్ప విజయమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎర్రంశెట్టి రమణయ్య, అల్లం పాపారావు, బందారు పైడియ్య, ధనాల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇది మామూలే..

- విద్యుత్ సిబ్బంది చేతివాటం
- ప్రతి చిన్న పనికీ సొమ్ము డిమాండ్
- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో హడల్
- పట్టించుకోని అధికారులు



కొత్తపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్



కొత్తపల్లి రవీంద్రపురంలో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కొత్తపల్లి: విద్యుత్ తీగ తెగేలా ఉంది.. వచ్చి సరి చేయాలంటూ విద్యుత్ శాఖ కార్యాలయంలో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఎప్పటికో సిబ్బంది వచ్చి పనిచేసి చేయి చాపారు. ఏంటని సదరు యజమాని అంటే మాకు 'మామూలే' అని చెప్పుకొచ్చారు. ఇలా ఒకటేమిటి అనేక ఘటనలు జరుగుతున్నాయి. ఏ చిన్న పనైనా సొమ్ము లేకుండా ముందుకు కదలడం లేదు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన యంత్రాంగం కనీసం పట్టించుకోక పోగా, చేతులు చాపడం ఏంటని సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది.

**ప్రతి పనికీ ఓ రేటు**

కొత్తపల్లి మండలంలో వేల సంఖ్యలో విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటికీ సంబంధించి కొత్తపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. గృహావసరాలకు సంబంధించిన విద్యుత్‌కు అంతరాయం కలిగితే స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తే రూ.100 నుంచి రూ.150 వరకూ ఆ శాఖ సిబ్బంది వసూలు చేస్తున్నారని చాలామంది వినియోగదారులు వాపోతున్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్, విద్యుత్ మీటర్ మార్పు చేస్తే రూ.300 నుంచి రూ.500 వరకూ సమర్పించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సిబ్బంది ఉండగా, వీరికి అనుబంధంగా గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తులు పనులు చేయడం శోచనీయం. అయినా ఆ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడంపై విమర్శలకు తావిస్తోంది.

**చేతికందేలా యమపాశాలు**

మండలంలో చాలాచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కవచాలు లేవు. దీనికితోడు చేతికి అందే ఎత్తులోనే ఉన్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఏ క్షణం ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రమాదాలూ చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, అమీనాబాద్, పొన్నాడ, కోనపాపపేటతో పాటు కొమరగిరి, కొత్తపల్లి, ఇసుకపల్లి, గొర్స గ్రామాలతో పాటు పలు ప్రధాన రహదారుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు లేకపోవడం, చేతికి అందే ఎత్తులో ఉండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు.

**ప్రమాదాలు జరుగుతున్నా..**

ఇటీవల కొండెవరం వేంకటేశ్వరస్వామి ఆలయ సమీప వీధిలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ కారణంగా పాడి గేదె మృతి చెందింది. కొండెవరం ఇందిరా కాలనీలో 11 కేవీ విద్యుత్ తీగలు ఇంటిపై నుంచి వెళ్లడంతో అవి తగిలి ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. కొత్త ఇసుకపల్లి సచివాలయం సమీపంలో కిందకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి పాడి గేదె చనిపోయింది. పలు సందర్భాల్లో విద్యుత్ శాఖ సిబ్బందీ గాయాల పాలయ్యారు.

**సొమ్ము ఎవరికీ ఇవ్వొద్దు**

గృహ సంబంధిత మరమ్మతులు చేసినా, కొత్త మీటర్లు అమర్చినా సిబ్బందికి వినియోగదారులు ఎటువంటి సొమ్ము ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇలాంటి ఘటనలు మా దృష్టికి రాలేదు. ప్రైవేట్ వ్యక్తులతో బయట విద్యుత్తు తీగల మరమ్మతులు చేయించరాదు. మండలంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయిస్తాం.
– ప్రమోద్, విద్యుత్ శాఖ ఏఈ, కొత్తపల్లి

# విద్యుత్ తీగల తొలగింపునకు కృషి

- ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ప్రభాకర్
- సబ్ స్టేషన్ ముందు ఆందోళన చేసిన గణేష్ కాలనీ వాసులు
- బాధితురాలికి ఆర్థిక సాయానికి అంగీకారం
- షిఫ్టింగ్ సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తానని హామీ

సాక్షి ఇంపాక్ట్



సామర్లకోట సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఏపీఈపీడీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రభాకర్

సామర్లకోట: స్థానిక గణేష్ కాలనీలో ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్తు వైర్లను మార్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద ఆ ప్రాంత ప్రజలు శుక్రవారం ధర్నా చేశారు. ఇటీవల ఇంటి మీదుగా వెళుతున్న విద్యుత్తు వైర్లు తగిలి మాల్లారపు మంగ ప్రమాదకర స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో 'ఏ ప్రాణానికి ఏ పాశమో!' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆ ప్రాంత ప్రజలు స్పందించారు. సుమారు వంద మంది ఐక్యంగా సబ్ డివిజన్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. బాధితురాలు మంగకు న్యాయం చేయాలని, ఇళ్ల మీదుగా వెళ్తున్న వైర్లు మార్చాలని నినాదాలు చేశారు. వారి ఆందోళనకు అధికారులు స్పందించారు. ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ఎవీఎస్ డీఎస్ ప్రభాకర్ వారి వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆ ప్రాంత నాయకులతో సంప్రదించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే వైర్లు మార్చడానికి షిఫ్టింగ్ చార్జిలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కానీ ప్రమాదాలు జరుగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తామని వారికి తెలిపారు. ఇటువంటి ప్రమాదాలపై ఎమ్మెల్యే రాజప్పకు వివరించి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈఈ హామీ ఇచ్చారు. దీనికి ఆందోళనకారులు అంగీకరించారు. విద్యుత్ లైన్లు పరిశీలించి అంచనాలు తయారు చేసి ఎమ్మెల్యేను సంప్రదించి, షిఫ్టింగ్‌కు ఎంత ఖర్చు అవుతుందో తెలియజేస్తామని ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ కొత్తపల్లి రాంబాబు, ఏడీఈ ఎల్ ఎల్ కిరణ్, ఏఈ పి.రమేష్‌కుమార్, ఆందోళనకారుల నాయకులు కచ్చా కృష్ణ, రాజు, ఎం.జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



మరిడమ్మ తల్లి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ఏటా నిర్వహించే పెద్దాపురం మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం **సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.** ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

## శాకంబరిగా సత్తెమ్మతల్లి



శాకంబరి అలంకరణలో విజయ సత్తెమ్మ తల్లి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద ఈశ్వర్‌నగర్‌లోని విజయ సత్తెమ్మ తల్లి శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం చివరి శుక్రవారం భక్తుల సహకారంతో అమ్మ వారిని వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

# జల గరళం

- రెండు నెలలుగా కలుషిత నీటి సరఫరా
- సమస్య చెప్పినా పట్టించుకోని అధికారులు
- స్వయంగా తనిఖీ చేసిన డీపీఓ



తాగునీటి ట్యాంకుల పరిశీలనకు వచ్చిన డీపీఓ భారతీ సౌజన్యను నిలదీస్తున్న గ్రామస్తులు



డ్రైవర్స్‌కాలనీలో తాగునీటి నమూనాలను సేకరిస్తున్న పంచాయతీ అధికారులు

కాకినాడ సిటీ: వర్షాకాలం నీరు కలుషితమయ్యే అవకాశం ఉండే సమయం. అందుకే తాగునీటి సరఫరాపై అటు గ్రామ, ఇటు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. క్లోరినేషన్‌తో పాటు నీటి శుద్ధిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. కానీ కాకినాడ రూరల్ మండలం తూరంగిలో తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా కలుషితనీరు ఇళ్లకు సరఫరా అవుతోంది. ఆ నీటితో స్నానాలు చేస్తున్న వారికి ఒళ్లు దురదలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తూరంగి పంచాయతీ పరిధిలో దాదాపు 30 వేలకు పైగా జనాభా ఉండి 15 వేలకు పైగా ఆవాసాలున్నాయి. తూరంగి పంచాయతీ పరిధిలోని బుల్లబ్బాయిరెడ్డినగర్ వద్ద 10 ఎకరాల్లో ఏర్పాటు చేసిన తాగునీటి పంప్‌హౌస్ నుంచి తూరంగి, కరప మండలం ఉప్పలంక, నడకుదురు, పెనుగుదురు తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. పంప్‌హౌస్‌లో క్లోరినేషన్ చేయడంతో పాటు పటికను కలుపుతారు. గతంలో ఈ పంప్‌హౌస్ నుంచి శుభ్రమైన నీరు సరఫరా అయ్యేది. రెండు నెలలుగా ఈ పంప్‌హౌస్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కలుషిత నీరు వస్తోంది.

**చర్మ వ్యాధులకు ఆస్కారం**

కలుషిత నీటితో స్నానం చేసినా, వంట చేసినా ఇబ్బందేనని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం తూరంగిలో ప్రతి ఇంట్లోనూ పంచాయతీ సరఫరా చేసిన నీటినే వాడుతున్నారు. స్నానానికి, వంటకు ఇతర అవసరాలకు ఆ నీరే వాడకం. మట్టి రంగులో ఉన్న నీటితో స్నానం చేయడం వల్ల శరీరంపై దద్దర్లు తదితర స్కిన్ అలర్జీలు వస్తున్నాయి. ఆ నీటితో వండిన ఆహారం తినడం వల్ల డయేరియా ప్రబలుతోంది. తూరంగి డ్రైవర్స్ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీల్లో రక్షిత నీటిని ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా అందిస్తున్నా నీరు రంగ మారి రావడం, అక్కడక్కడ నీటిలో వివిధ రకాల నలకలుగా రావడంతో పంచాయతీ అధికారులు పలు దఫాలుగా పరిశీలించారు. ఇంటింటా నీటిని సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో తాగునీరు సరఫరా అవుతున్న పైపులైన్లులో ఎక్కడైనా లీకేజ్ ఉందేమోనని అధికారులు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. తాగునీటి పైపుల ద్వారా మురుగు నీరు రావడంతో జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య సైతం ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి తూరంగి డ్రైవర్స్‌కాలనీ, ఏఎస్‌ఆర్ కాలనీల్లో తాగునీటిని సరఫరా చేస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకులను సందర్శించి తనిఖీ చేశారు.

**దురదలు వస్తున్నాయి**



తూరంగి పంచాయతీ ద్వారా సరఫరా చేస్తున్న నీటితో స్నానం చేస్తుంటే శరీరంపై దురదలు వస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీ అధికారులకు తెలియజేశాం. అధికారులు వస్తున్నారు, చూసి వెళ్తున్నారు. చర్యలు మాత్రం శూన్యం. అయినా సరఫరా చేస్తున్న నీటిలో ఏ మాత్రం మార్పులేదు. కొంత మంది ఆ నీటితో చేసిన ఆహార పదార్థాలు తిన్నవారు డయేరియా బారిన పడి ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వైద్యానికి రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అధికారులు స్పందించి నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలి.
– **చింతపల్లి అజయ్‌కుమార్,** తూరంగి పౌర సంక్షేమ సంఘం నాయకులు.

## తల్లి పాలతో శిశువుకు ఆరోగ్యం



మూలపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మూలపేట సెక్టార్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో, నాగులపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. శిశువుకు మొదటి ఆరు నెలలు తల్లి పాలు ఇస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఘనంగా పింగళి జయంతి

సామర్లకోట: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పింగళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం



దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక శిబిరం వద్ద రద్దీ

పిఠాపురం: స్థానికంగా రథాలపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి 600 మంది దివ్యాంగులు వచ్చారని జిల్లా సహాయ సంచాలకుడు పి.నారాయణమూర్తి తెలిపారు. బ్యాటరీ చార్జింగ్ సైకిళ్లకు 51 మంది, మూడు చక్రాల సైకిళ్లకు 32 మంది, వీల్ చైర్లకు 26, చంక కర్రలకు 64, శ్రవణ యంత్రాలు 43, కృత్రిమ అవయవాలకు 7, కాలిఫర్స్‌కు 1, బ్లైండ్ స్టిక్స్‌కు 21, వాకింగ్ స్టిక్స్‌కు నలుగురిని ఎంపిక చేశామన్నారు.

## అన్నా క్యాంటిన్ ఏర్పాట్ల పరిశీలన

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటిన్‌ను మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు శుక్రవారం పరిశీలించారు. గతంలో ఉండే అన్న క్యాంటిన్‌లో జగ్గమ్మగారిపేట ఎలిమెంటరీ పాఠశాల ఉండేది. దానిని ఖాళీ చేయించి అన్నా క్యాంటిన్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను కమిషనర్ పరిశీలించి అవసరమైన సదుపాయాలను కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 15న అన్నా క్యాంటిన్ల ప్రారంభానికి దీనిని సిద్ధం చేస్తున్నారు.

## ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసరెడ్డి

కాకినాడ లీగల్: సర్పవరం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా కేవీ శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఇన్‌చార్జిగా సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇప్పటి వరకు డిప్యూటేషన్‌పై సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న సి.రమేష్‌కు డిప్యూటేషన్ రద్దు చేయడంతో యథాస్థానం మామిడికుదురుకు సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

# ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా?



వీకే రాయపురం ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

సామర్లకోట: వీకే రాయపురం నుంచి సత్యవరపుపేట వెళ్లే రోడ్డుకు గొయ్యి పడి 20 రోజులు గడిచినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. బోయనపూడి, ఏపీ త్రయం గ్రామాలకు సాగునీరు వెళ్లడానికి గోదావరి కాలువ నుంచి వీకే రాయపురం రోడ్డు దిగువ భాగం నుంచి తూరలు ఏర్పాటు చేశారు. వాహనాల రాక పోకలతో ఒక తూర పగిలింది. దాంతో ఆ ప్రదేశం ప్రమాదకరంగా మారిందని ఆ ప్రాంత ప్రజలు రేలంగి రాంబాబు, ఇంటి వెంకట్రావు, వెలమర్తి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గొయ్యి వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే కానీ అధికారులు స్పందించరా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డులో భారీ వాహనాల రాక పోకలు జరిగే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ముందు జాగ్రత్త చర్యగా స్థానికులు చెట్టు కొమ్మలను ఆ గొయ్యి వద్ద ఏర్పాటు చేశారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- సర్పవరం, కాకినాడ రూరల్ సీఐలుగా పెద్దిరాజు, చైతన్యకృష్ణ నియామకం



రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన చైతన్య కృష్ణ



సర్పవరం సీఐగా బాధ్యతలు చేపట్టిన బి.పెద్దిరాజు

కాకినాడ రూరల్: ప్రజలకు సకాలంలో పోలీసు సేవలతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని సర్పవరం, కాకినాడ రూరల్ సీఐలుగా బాధ్యతలు చేపట్టిన బొక్కా పెద్దిరాజు, డీఎస్ చైతన్యకృష్ణ పేర్కొన్నారు. సీఐల బదిలీలలో భాగంగా సర్పవరం స్టేషన్ సీఐగా పెద్దిరాజు నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన వైఆర్‌కే శ్రీనివాస్ స్థానంలో ఆయన శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రావులపాలెం, రాజోలు, అంతర్వేది తదితర చోట్ల పనిచేసిన పెద్దిరాజు ప్రస్తుతం వీఆర్ నుంచి సర్పవరం స్టేషన్‌కు సీఐగా నియమితులయ్యారు.
కాకినాడ ట్రాఫిక్ – 2 సీఐగా పనిచేస్తున్న డీఎస్ చైతన్యకృష్ణ కాకినాడ రూరల్ సర్కిల్‌కు సీఐగా నియమితులవ్వడంతో ఆయన శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, ట్రాఫిక్ సీఐ రమేష్, ట్రాఫిక్ ఎస్సైలు ఆయనకు అభినందనలు తెలియజేశారు. చైతన్యకృష్ణకు గతంలో సర్పవరం స్టేషన్‌లో పనిచేసిన అనుభవం ఉంది.

# నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి

డీఎఫ్ఓ భరణి



జిల్లా అటవీ అధికారి భరణిని సత్కరిస్తున్న ఏజీఎం రాఘవేంద్రరావు తదితరులు

కాకినాడ: విద్యార్థి స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి పేర్కొన్నారు. స్థానిక రామారావుపేటలోని నారాయణ ఈ టెక్నో ఒలింపియాడ్ పాఠశాలలో శుక్రవారం ఇన్వెస్టిట్యూర్ వేడుక నిర్వహించారు. ఇందులో భాగంగా స్టూడెంట్ క్యాబినెట్ ఎన్నికల ఫలితాలను వెల్లడించారు. గౌరవ అతిథిగా హాజరైన పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు జార్జి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక క్రీడల్లోనూ ఆసక్తి పెంపొందించుకోవాలని వివరించారు. ఎన్నికైన వివిధ విభాగాల విద్యార్థి నాయకులను విశేష అతిథి, ఏజీఎం రాఘవేంద్రరావు, జోనల్ కో–ఆర్డినేటర్ సుంకర మూర్తి, పాఠశాల ప్రిన్సిపల్ షర్మిల, ఇ– కిడ్స్ జోనల్ కోఆర్డినేటర్ సఫూరా, ఆర్ఎస్‌టీ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు బ్యాడ్జిలతో సత్కరించారు. తదనంతరం విద్యార్థి నాయకులు అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా సాఫ్ట్ స్కిల్స్ మెంటర్ పద్మలత వ్యవహరించారు.